# "పావలా పోలీసు"

## కొండేటి శేషారావు (కళావాణి)

పోలీసు పవిత్రతని ప్రతివారూ శంకిస్తూనే ఉంటారు. పోలీసుప్రవర్తన ప్రతివారూ వసికట్టూనే ఉంటారు. పోలీసు పగపట్టుతూనే ఉంటాడీ తరగతిని.

ఎర్రబుట్ట క్రిందదంతా దోచేబుద్ధనే ప్రజాభిప్రాయం. కాకీరంగు క్రిందదంతా కుటిలకంకాళమనే ఏకాభిప్రాయం అందరిదీ పోలీసు ఒకకంట కనిపెడ్తూనేఉంటాడు ఒక్కొక్కర్నీ.

జీవితసుఖాన్ని దూరంచేసుకుని, వ్యక్తిత్వాన్ని వదలుకొని తాత్కాలిక కామోపశమనానికి ఉపయోగించుకునేందుకుంతెచ్చుకున్న స్త్రీసాధనాన్ని తత్ఫలితంగా బయటపడ్డ కసుగాయల్ని జీవితాంతం వరకూ భరించేందుకు ప్రభుత్వనియమావళికి కారిన్యకట్టుబాట్లకి బంధించబడ్డ మానవకళేబరమే పోలీసుకూడ.

లూటీచేస్తున్న గుంపులో తనూ ఒకడైతే పడే బాధ తెల్పున్నప్పటికీ ఎదుటివారిపై తుపాకికాల్చేప్పుడు వారే తానైతే గగ్గోలుపెట్టే భార్యాబిడ్డలు కంటికి కనుపించినప్పటికీ తనవిధి నిర్వర్తింపక తప్పదతనికి.

ఏభయ కంపితుణ్ణి భయవిముక్తుణ్ణి చేస్తాడో అతడే పదిమందిలో పరిహాసిస్తాడు.

పరిహాసంలేని ప్రతిరోజూ అతనికి పండుగే.

పోలీసు ఉద్యోగంలోచేరిన మొదటిరోజుల్లో పాపారావు ప్రవృత్తి చాల విచిత్రంగాఉండేది, ప్రొద్దుపొడిచిందిమొదలు ప్రొద్దుగ్రుంకేంతవరకూ మనస్సునను సమాధానపర్చుకునేందుకే కాలం సరిపోయేదికాదు.

పాపారావు పోలీసుఅవడానికి ఆతని కుటుంబ పరిస్థితులే సహకరించాయి. చిన్న చదువులో ఉండగానే సంపద గ్రిబిడికిపోయింది. అందుచేత చదువుకి స్వస్తిచెప్పవలసివచ్చింది.

చదువు తక్కువఅవడంవల్ల పొట్ట పోషించుకునేందుకు పోలీసు ఉద్యోగంకంటె తేలిగ్గా మరోఉద్యోగం దొరకనందున ఈ కాకీగుడ్డల కంకితంకావల్సివచ్చింది. ఉండడానికిల్లూ, దున్నడానికి దుక్కీ లేనివాడికి పిల్లనిస్తానా అన్న మేనమామ పోలీసు ఉద్యోగం పటుత్వం తెలియక గొప్పదేమో అనుకుని కూతుర్నికట్టబెట్టాడు.

ఇంతటితో పాపారావుకు ప్రథమ సమస్య ప్రారంభమైంది. తనసంపాదన తన స్వసౌఖ్యానికి చాలనప్పుడే భార్యాభారం భరించడం యెలా అనుకుంటూనే సంతాన సంపాదనకికూడా సమకట్టాడు

అతని జీవితపట్టంయిది ప్రస్తుతం. అతని శరీరం మాత్రం రోడ్డుమీద పోతోంది కాని తన జీతం, భత్యం అంతా ప్రసవఖర్చులకు చాలలేదు కదా. వచ్చే నెలజీతం భత్యంకూడ మంత్రసానికి సరిపోతే జీవనయాత్ర సాగించేదెలా అని అతని ఆలోచన.

పరాయివారి పచ్చిమంచిపీరైనా పుచ్చుకోని పాపారావు చట్టబద్ధంగా చరించాడింతవరకూ.

పసిపాప పాలకోసం గోలచేస్తూంటే పాలఖరీదుకు బదులైనా సాధించలేక కర్తవ్యం తెలీక దారితప్పిపోతున్నాడు.

ఎందరెందర్నో అర్థించాడు ప్రతిపురుషుణ్ణి ప్రార్థించాడు. ఒక్కరూ కనికరించలేదు. పోలీసు కాకీతీరుస్తాడా అనే అనుమానం బలవత్తరమై పాపారావుకు పావలా అయినా పుట్టనివ్వడంలేదు.

పరిస్థితులు ప్రోత్సహిస్తున్నాయి. మనస్సు మందలిస్తోంది, బుద్ధిబిడ్డని జ్ఞప్తికి తెస్తోంది, తట్టుకోలేక పోతున్నాడు మానవుడు,

వెలుగుపోయింది చీకటి వచ్చింది పాపారావుకు తెలియదు మునిసిపల్ దీపాలు వెలిగాయి.

ఎంతో వేగంగా వస్తోందో సైకిలు దీపంలేదు. పరిస్థితులు పరాజితుణ్ణి చేస్తున్నాయి మనస్సు మందలింపు మందగిస్తోంది మానవుడు మరో మార్గం మరలి పోతున్నాడు సైకిలు సమీపించింది దాటుకుపోబోతోంది.

"ఏయ్! సైకిలుదిగి పేరుచెప్పు"

"నన్నుపోనిద్దు ఎందుకు బాధ పెడతావు"

"అలాంటిదేం కుదురదు దిగిపేరుచెప్పు"

"నేనేం పావలాడబ్బులిచ్చేవాణ్ణికాను"

"లేకపోతేపోనీ కోర్టుచుట్టూ తిరగవలసిందే. చెప్పు"

"తప్పదంటావు"

"పావలా పారేస్తే పోనివ్వనూ. ఇందులో తెలియందేం ఉంది?"

"అయితే రాసుకో యస్. భానోజీరావు. డి. యస్. పి. ఆఫీసు"

పాపారావు స్పృహతప్పింది. సైకిలు మాయమయింది.

భానోజీరావు అనంతపురంనుంచి ప్రమోషను మీద బదిలీచేసారనీ హృదయ రహితుడనీ విన్నాడేగాని దర్శనం చెయ్యలేదు.

ఎప్పుడూ తప్పుచేసేవారు ఎప్పుడూ దొరకరు, ఎప్పుడోతప్పుచేసేవారు ఎప్పుడూ దొరుకుతారు. భానోజీరావు చేతిలో పాపారావు బ్రతుకేమౌతుందో పాపారావే యెరుగడు. సంగతి విన్నమీదట సరితూగే సలహా యెవ్వరూ యివ్వలేక పోతున్నారు.

"భానోజీరావంటే నిప్పులాంటి మనిషి" అనీ భానోజీరావు యింతపైకి రావటానికి అతని పవిత్రతే కారణం అనీ, "భానోజీరావు పవిత్రతను మెచ్చుకోతగ్గ" దనీ, 'భానోజీరావు పట్టినపగ సాధించితీర్తాడు'అనీ పదిమంది పదిరకాలుగా పలికేరు పాపారావు పోలీసు ఉద్యోగానికి తర్పణం వదలుకోడానికి నిశ్చయించాడు.

పట్టిన పట్టుమీద ప్రాణస్నేహితుని పోరువల్ల పాపారావు తెగించేసాడు. పోయేఉద్యోగంయిన్నిసార్లు పోదనుకున్నాడు. జీవిత సమస్యతేల్చుకోదల్చాడు. ఏ నిర్ణయానికి రావాలని ఆరాట పడుతున్నాడో ఆ నిర్ణయానికొచ్చాడు.

పాపారావు పోలీసు ఉద్యోగం పాతికతో నిలువబడింది. పావలా పుట్టని పాపారావుకు పాతిక పుట్టిందంటే ప్రతివారికీ పరమ ఆశ్చర్యంగా ఉంది అక్కడ.

★

## ఏజంట్లు కావలెను

"ఆనందవాణి" పత్రికను కమీషనుపద్ధతి మీద విక్రయించడానికి మా ప్రతినిధులు లేని ప్రాంతాలలో ఏజెంట్లు కావలెను. ధరావత్తు కట్టగలిగినవారు ఇతర వ్యాపార షరతులకు ఈ దిగువచిరునామాకు వ్రాయవచ్చును.

మేనేజరు
"ఆనందవాణి"
12, తంబుచెట్టి వీధి
మద్రాసు - 1